www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025



వికాస ఆధ్వర్యంలో 20న జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస ఆధ్వర్యంలో ఈ నెల 20న కలెక్టరేట్ వికాస కార్యాలయం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కొన్ని ప్రముఖ కంపెనీలైన మహింద్రా ట్రాక్టర్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్, ఇండో ఎంఐఎం, హ్యుండాయ్ మోబీస్, పానాసోనిక్, ఇసుజు మోటార్స్, కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. డియుజికెవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారని తెలిపారు. వీరికి నెలకు రూ.12,000 నుంచి రూ.20,000 వరకు జీతం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7799376111, www.vikasajobs.comలో సంప్రదించాలని తెలిపారు.


పెట్టుబడి సాయం ఏదీ..?

- రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- హామీ అమలు పట్టించుకోని వైనం
- రైతుల ఎదురు చూపులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎటువంటి నిబంధనలు పెట్టకుండానే రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు పలు సభల్లో హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పైనే కావస్తున్నా నేటికీ రైతుల సంక్షేమంపై కనీసం పట్టించుకోవడం లేదు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఉదరగొట్టిన సిఎం, డిప్యూటీ సిఎం హామీలపై ఇప్పుడు నోరు మెదపకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి సాయంపై కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంపై రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఎపిలో 'అన్నదాత సుఖీభవ' పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కూడా పెట్టుబడి సాయంపై ప్రకటన చేశారు. సంక్రాంతి తర్వాత అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని ప్రకటించారు.

జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం అన్నదాతలను ఆదుకుంటుందని పాలకులు ప్రకటనలు ఇస్తున్నా ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. పంట పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో చిక్కుకోకూడదనే ఉద్దేశ్యంతో రైతుభరోసా సాయం అందించామని గత ప్రభుత్వం చెప్పుకొంది. ఈ నేపథ్యంలో కేంద్రం సాయంతో కలుపుకుని రూ.13,500 ఇచ్చేది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాయంపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. దీంతో ఇప్పుడు చేయి చాచి అప్పులు అడిగే పరిస్థితిలోకి వెళ్ళాల్సి వచ్చిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలోనే సొమ్ములు వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నా హామీ ప్రకారం ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి సాగు పనులు చేపడుతున్నారు. ఖరీఫ్ పూర్తయి, రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ అందించే సాయంపై కనీసం ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఏటా మూడు విడతలుగా సాయం అందించగా ఈ ప్రభుత్వం నేటికీ ఊసెత్తకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే కేంద్రం రెండు విడతల్లో రూ.4 వేలు అందించగా దానితో సంబంధం లేకుండా ఇస్తామన్న రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారని రైతులు స్థానిక ప్రజాప్రతినిధులను అడుగుతున్నారు. వాస్తవానికి కేంద్రం పిఎం కిసాన్ పేరిట మూడు విడతల్లో రైతులకు ఏడాదికి రూ.6 వేలు ఈ పెట్టుబడి సాయం అందిస్తుండగా ఎపిలో మాత్రం పథకాల అమలుపై ఇంకా స్పష్టతకు రాలేదని తెలుస్తోంది. అయితే అన్నదాత సుఖీభవ, రైతు భరోసా పథకాల అమలు కోసం పలువురు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం కౌలు రైతుల్లో ఒసిలకు పెట్టుబడి సాయాన్ని ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం కౌలు రైతులందరికీ ఎలాంటి నిబంధనలూ లేకుండా సాయం అందించాలని కోరుతున్నారు. పథకం విధి విధానాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.



వెంటనే సాయం అందించాలి



అధికారంలోకి వచ్చిన వెంటనే జూన్‌లోనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికలప్పుడు చంద్రబాబు ప్రకటించారు. ఎటువంటి షరతులు లేకుండా రూ.20 వేలు ఇస్తామని చెప్పుకొచ్చారు. నేటికీ దాని ఊసే లేదు. సాగు సీజన్లు పూర్తి కావస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలి. లేకుంటే ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు చేస్తాం.

– తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు.

జ్యోతిబసుకు పలువురి ఘన నివాళి

పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా సేవలందించి చరిత్ర సృష్టించిన సిపిఎం నేత జ్యోతిబసు 15వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు పలువురు ఘనంగా నివాళు లర్పించారు.

ప్రజాశక్తి- యంత్రాంగం



కాకినాడలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కాకినాడ సుందరయ్య భవన్‌లో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు దువ్వా శేషబాబ్జీ, కె.సత్తిరాజు జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసించిన జ్యోతిబసు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. కార్మికుల శ్రేయస్సు కోసం ఆయన జీవితాన్ని అంకితం చేసారని కొనియాడారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో తొలితరం నేతగా ఉన్న జ్యోతిబసు సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యునిగా కష్టజీవుల హక్కుల కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా విరామం లేకుండా 23 ఏళ్లు పని చేసిన జ్యోతిబసు భూ సంస్కరణలు అమలు చేసారని, పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామీణ పేదలను పాలనలో భాగస్వాములను చేసారన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు మలకా వెంకట రమణ, కె.నాగజ్యోతి, మేడిశెట్టి వెంకటరమణ, సిహెచ్.సతీష్, ఎ.ఏడుకొండలు, సిహెచ్.అజయ్, టి.రాజా, రామిరెడ్డి, ప్రసాద్, అదృష్టదీపుడు పాల్గొన్నారు.



పెద్దాపురంలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పెద్దాపురం వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో నీలపాల సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ మాట్లాడారు. తొలుత జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ, డి.కృష్ణ, రొంగల వీర్రాజు, కూనిరెడ్డి అరుణ, గడిగట్ల సత్తిబాబు, అరుణ్, చల్లా విశ్వనాథం పాల్గొన్నారు.



పిఠాపురంలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పిఠాపురం స్థానిక నండూరి ప్రసాదరావు భవన్‌లో కె.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో సిపిఎం మండల కన్వీనర్ కుంచే చిన్న ఆయన చిత్రపటానికి పూలమాలవేసిన నివాళులర్పించారు. సిపిఎం నాయకులు విశ్వనాథం, సత్తిబాబు, సూర్యనారాయణ, వీరబాబు, నందీశ్వర రావు, మణి, రాజ్యలక్ష్మి, గోపాలకృష్ణ, ఎస్.శ్రీను, రాజేష్, నాగేశ్వరరావు మణికంఠ పాల్గున్నారు.

గణతంత్ర దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 26న కాకినాడ పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో సన్నాహక ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26న ఉదయం 9 గంటలకు కాకినాడ పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. ఈ గణతంత్ర వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొననున్న దృష్ట్యా పటిష్టమైన బందోబస్తుతో పాటు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వేడుకలకు హాజరయ్యే ప్రముఖులతో పాటు ప్రతి ఒక్కరికీ తగిన సిటింగ్ ఏర్పాట్లు, ఇతర అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ పేరేడ్ ప్రాంగణంలో తగిన తాగునీటి వసతి, పారిశుధ్య నిర్వహణ, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. తొలుత డిఆర్ఒ జె.వెంకటరావు వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివరించారు.

సారా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

పెద్దాపురం : కాకినాడ జిల్లాను సారా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక బ్యాంకు కాలనీలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ సిబ్బంది సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

అప్పారావు వేదిక ఆధ్వర్యాన సంక్రాంతి పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

చింతపల్లి అప్పారావు అభ్యుదయ వేదిక అధ్వర్యంలో తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో ఈ నెల 12 నుంచి 16 వరకూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా వివిధ రకాల పోటీలు పోటీలు నిర్వహించారు. ముగింపు రోజున అభ్యుదయ వేదిక నాయకురాలు సిహెచ్.విజయ అధ్యక్షతన జరిగిన సభలో బహుమతి ప్రదానం చేశారు. స్కేటింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో రజిత పతకం విజేతులైన అరదాడి మహీధరరాజ్‌కుమార్‌ను సినీ నిర్మాత పిడిఆర్.ప్రసాద్ రెడ్డి, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, సిహెచ్.అజయ్ కుమార్ అభినందించారు. ఈ సందర్భగా వారు మట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి మహీధర్ లాంటివారు ఎందరో ఆటల్లో ఉత్సాహం చూపుతున్నారని, అలాంటి వారందరికీ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయిలో రజితం సాధించిన మహిధర్‌కు అన్ని సదుపాయాలూ, తగిన ప్రోత్సాహం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం పోటీల్లో విజేతలకు కెల్లా రాజప్ప, పిడిఆర్.ప్రసాద్ రెడ్డి, దూసర్లపూడి రమణరాజు, జుత్తుగ శ్రీనివాస్, జోగా అప్పారావు, చంద్రశేఖర్, పద్మనాభం, సిహెచ్.శివకుమార్, రమణమ్మ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.ధర్మశస్త్ర, టి.అరుణ్ కుమార్, సిద్ధూ, దుర్గా ప్రసాద్, చందు, దాసరి లత, సిహెచ్.శ్రీరమణి, హర్షిణి నాయకత్వం వహించారు.

రీ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఎవరి భూములు వారికే దక్కే విధంగా రీ సర్వే అప్డేట్, డేటా ఎంట్రీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పెద్దాపురం ఆర్‌డిఒ కె.శ్రీరమణి సూచించారు. సామర్లకోట టిటిడిసి శిక్షణా కేంద్రంలో డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన మండల సర్వేయర్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి మాట్లాడారు. భూ సమస్యలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు నమోదైనా వాటిని సానుకూలంగా పరిష్కరించాలన్నారు. దానికి సంభందించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సూచనలు అందించినందున వాటిని అనుసరించి గ్రామాల్లో రైతులకు సేవలనందించాలన్నారు. ఈ సందర్భంగా రీ సర్వే, డేటా ఎంట్రీ పై పలువురు మండల స్థాయి అధికారులకు పలు విషయాలు వివరించారు. డిఎస్‌ఎల్ఒ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి

పెద్దాపురం రీ సర్వే అప్డేటెడ్ ఎస్ఒపి డేటా ఎంట్రీ పై రీ సర్వే శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఆర్‌డిఒ శ్రీరమణి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో డివిజన్‌లోని 11 మండలాల తహశీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు రీ సర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఎల్ఒ కె.శ్రీనివాసరావు, పెద్దాపురం తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

పింఛనుదారుల అనారోగ్య పరిస్థితి పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో దీర్ఘ కాలిక వ్యాధులకు లోనై చికిత్స పొందుతున్న 9 మంది పింఛనుదారుల అనారోగ్య స్థితిగతులను శుక్రవారం వైద్య బృందం పరిశీలన జరిపిందని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వడ్లమూరులో ఇద్దరు, దివిలిలో ఒకరు, ఉలిమేశ్వరంలో ఇద్దరు, పులిమేరులో నలుగురు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు నెలకు రూ.15 వేల చొప్పున పింఛను ఇస్తున్నట్టు తెలిపారు. వీరి అనారోగ్య స్థితిగతులను పులిమేరు, కాండ్రకోట పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ చంద్ర కిరణ్‌బాబు, డిఎం అండ్ హెచ్ఒ నియమించిన డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నందిని బృందం శుక్రవారం ఇంటింటికీ వెళ్లి పరిశీలన జరిపిందన్నారు. ఈ బృందంలో ఆయా పంచాయితీల కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ సెక్రటరీలు పాల్గొన్నారన్నారు. ఈ రిపోర్టును డిఎంహెచ్ఒకు సమర్పిస్తారన్నారు.

మరిడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత అభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూదితో అభిషేకాలు చేసి స్వర్ణ, రజిత పుష్పాలతో పూజలు నిర్వహించారు. అనంతరం యాత్రికులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఆసాదులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై మత్స్యకారులకు అవగాహన

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

సైబర్ నేరాలపై మత్స్యకారులకు శుక్రవారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి డేటాను అడిగితే తెలపద్దని, తెలియని యాప్‌లను ఫోన్లో డౌన్లోడ్ చేసి క్లిక్ చేయకూడదని తెలిపారు ఇతర లింకులను సైతం చూడవద్దన్నారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అవగాహన లేని వ్యక్తులను టార్గెట్ చేసి అకౌంట్లో ఉన్న సొమ్మును స్వాహా చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు

శరవేగంగా అభివృద్ధి పనులు : ఎంఎల్‌ఎ నానాజీ


ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల కాలంలో శరవేగంగా అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నట్టు కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ పి.సతీష్ ఆధ్వర్యాన ఇన్‌ఛార్జి ఎంపిపి బందిలి విరీష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సమావేశంలో భాగంగా కాకినాడ రూరల్ మండల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. అనంతరం ఎంఎల్‌ఎ పంతం నానాజీ మాట్లాడారు. రూరల్ మండలంలో ఎన్నో ఏళ్ళుగా తిష్టవేసుకుని ఉన్న అనేక సమస్యలను కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే పరిష్కరించినట్టు తెలిపారు. మండల పరిధిలో 123 పనులకు గాను రూ.13 కోట్ల 15 లక్షలతో 18 కిలోమీటర్లు సిసి రోడ్లు నిర్మించామని, 6 కిలోమీటర్లు డ్రైన్లు, కరప మండలంలో 80 పనులకు గాను రూ.7 కోట్ల 43లక్షలతో 11 కిలోమీటర్లు సిసి రోడ్లు, 400 మీటర్లు సిసి డ్రైన్లు నిర్మించామని జరిగిందని తెలిపారు. రూరల్ మండలంలో 203 పనులకు గాను సుమారు రూ.20 కోట్ల 50 లక్షలు, కరప మండలంలో 70 పనులకు గాను సుమారు రూ.7 కోట్ల అభివద్ధి చేసేందుకు సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎ గుత్తుల భీమశంకర్, జనసేన నాయకులు కరెడ్ల గోవిందరాజులు, తిరుమన్ కుమార్ స్వామి, వల్లూరి రాజా, సర్పంచులు వలవల వెంకటేశ్వరరావు, ఆనంద్, ఎంపిటిసిలు నందిపాటి అనంతలక్ష్మీ త్రిమూర్తులు, ఎల్లబోయిన వీరవెంకట దుర్గ, ఓసిపిల్లి రాజేశ్వరి, సోదే ముసలయ్య, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

కార్టూ'నిజం'



రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

పటవల పంచాయతీలో జరుగుతున్న రీ సర్వే కు రైతులు సహకరించాలని తహసీల్దార్ పి. త్రినాధరావు విజ్ఞప్తి చేశారు. మండలంలో రీ సర్వే జరగని నాలుగు రెవెన్యూ గ్రామాల్లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పైలెట్ ప్రాజెక్టుగా పటవల గ్రామంలో రీ సర్వే ప్రారంభించామని సోమవారం నుంచి పూర్తిస్థాయిలో 12 బృందాలు రీ సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పటవల రెవెన్యూ గ్రామంలో 3022 మంది రైతులకు గాను 4086 ఎకరాలను రీ సర్వే చేస్తామని తెలిపారు. దీనిలో 563 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అన్నారు. అసైన్డ్ భూములు గుర్తించాల్సి ఉందని అన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వ నిబంధనలను సవరించి రికార్డుల ఆధారంగా ఒక్కో బృందానికి నలుగురు అధికారులు బాధ్యత వహిస్తూ సర్వే చేస్తారన్నారు. తనిఖీ అధికారులుగా రీ సర్వే డిటి వీరబాబు, మండల సర్వేయర్ షఫీతోపాటు, తాను ఈ సర్వేను సమన్వయం చేస్తానని ఆయన తెలిపారు. రీ సర్వేలో ఇబ్బందులు వస్తే (సెంట్రల్ టీమ్) కమ్యూనికేషన్ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. రీ సర్వేకు ముందు ప్రతి రైతుకూ నోటీస్ అందిస్తామని తెలిపారు. 140 రోజులు గడువు ఇవ్వడం ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహించే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిటి.సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో విలేకరులతో మాట్లాడుతున్న తహశీల్దారు

ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా పదోన్నతి కల్పిస్తూ నియామకపు ఉత్తర్వులు శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, సిఇఒ వివివిఎస్. లక్ష్మణరావు అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి రామ్ గోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న అన్ని పరిపాలనాధికారుల ఖాళీలను భర్తీ చేసినట్టు తెలిపారు. మండల పరిషత్ స్థాయిలో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములై చురుకైన పాత్ర వహించి ఆయా మండల పరిషత్‌ల అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 18న జరిగే పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామకృష్ణయ్య తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 37 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో కాకినాడ జిల్లాలో 14, కోనసీమ జిల్లాలో 16, తూర్పు గోదావరి జిల్లాలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షకు సంబంధించి 8,971 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆ రోజు దయం 11:30 గంటల నుండి 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. నవోదయ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం వద్ద వాహనాల వేలం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన దాడుల సందర్భంగా నాటు సారా, ఇతర నేరాలతో పట్టుబడిన ఐదు బైకులను శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. గత 5 నెలలుగా దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న 853 లీటర్ల నాటు సారా, 358 మద్యం సీసాలను శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధ్వంసం చేశామన్నారు. ఈ సారా, మద్యం సీసాల ధ్వంసం, వాహనాల బహిరంగ వేలంను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి పర్యవేక్షించారు.

'పెసా' అమలులో భాగస్వామ్యం అవ్వాలి

ప్రజాశక్తి-సామర్లకోట

గిరిజన ప్రాంతాల్లో ప్రజల హక్కులను పరిరక్షించేందుకు 'పెసా' చట్టం అమలు చేస్తున్నందున అధికారులంతా భాగస్వాములు కావాలని ఎపిఎస్ఐఆర్‌డి పంచాయతీరాజ్ జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో రెండు బ్యాచ్‌లుగా ఇచ్చే మాస్టర్ ట్రైనీల శిక్షణ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. శిక్షణాకేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణలో జెడి శ్రీదేవి, డిప్యూటీ డైరెక్టర్ జె.రామానాథం పాల్గొన్నారు. తొలుత జెడి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన మండలాల్లో ఫిబ్రవరి నెలలో పెసా చట్టంపై ప్రజలకు, అధికారులకు, ఎస్‌హెచ్‌జి సభ్యులకు, ఎన్‌జిఒలకు ఈ మాస్టర్ ట్రైనీల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. 5 జిల్లాలకు సంభందించి 108 మంది అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నట్టు చెప్పారు. ప్రతి మండలంలో శిక్షణలు ఇచ్చేందుకు ఆరుగురు సభ్యులు ఉంటుందగా వారిలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, నలుగులు పంచాయితీ కార్యదర్శులు ఉంటారన్నారు. రెండో బ్యాచ్‌కు ఈ నెల 21, 22 తేదీల్లో ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, కెఆర్.నిహారిక, వి.ఆంజనేయులు, ఎం.చక్రపాణిరావు, డిఆర్ఎన్.పద్మజ తదితరులు పాల్గొని మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి వంతెన దిగువున పటవలవైపు శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇవి.. కాకినాడ వైపు వెళుతున్న రెండు ద్విచక్ర వాహనాలను ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కోరంగి పంచా యతీ సీతారాంపురం గ్రామానికి చెందిన వ్యాపారి ఉమకా వెంకటేశ్వరరావుకు తకు తీవ్ర గాయమైంది. మరొక వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. వీరిని కాకినాడలో ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కోరంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

మద్యం అనుకుని, పురుగు మందు తాగిన మండలం నడకుదురు గ్రామానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరరావు (60) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. శుక్రవారం కరప ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాల మేరకు ఈనెల 11న నడకుదురు గ్రామంలో నివాసం ఉంటున్న తన పెద్ద కూతురు చీకట్ల రమణమ్మ ఇంటికి నాగేశ్వరరావు వెళ్లాడు. అయితే అక్కడ మద్యం సీసాలో ఉన్న చెదల మందును చూసి అది మద్యం సీసాగా అతను భావించాడు. అప్పటికే మద్యం తాగిన మత్తులో చెదల మందు ఉన్న సీసాలలో మందును తాగాడు. దీంతో వాంతులు చేసుకుంటూ ఉండగా నాగేశ్వరరావు భార్య పార్వతి చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను 16న రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్య నిర్ధారించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని తోటపేట గ్రామంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తోటపేట గ్రామంలోని దామిశెట్టి మహాలక్ష్మి (54) ఒంటరిగా జీవిస్తోంది. ఈమె ఈ నెల 11న తన కుమార్తె అల్లుడు బంధువులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వెళ్లి చూడగా ఆమె మతి చెంది ఉంది. ఆమె అంత్యక్రియలు వెంటనే పూర్తి చేశారు. అయితే మహిళ మెడలో ఉండాల్సిన బంగారు చైను, వస్తువులు లేకపోవడంతో ఆమెను ఎవరో హత్యచేసి బంగారం దొంగలించినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు అల్లుడు సలాది సురేష్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పంచనామ నిర్వహించి, అనుమా నాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి - తాళ్లపూడి

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేశామని తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు వేగేశ్వరపురం గ్రామానికి చెందిన మల్లాడి రత్నకుమార్ గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాలను చూసి బైకుపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన కావూరి ఆదర్శ్, బట్టు రవితేజ, అల్లాడి చంటి అనే ముగ్గురు యువకులు బైకు ఆపారు. బైకును పడేసి దాడి చేశారు. అంతేకాక ఇంటికి వచ్చి చంపుతామని బెదిరించారు. గోదావరి మేరీ మాత ర్యాంపు వద్ద లంగరు వేసి ఉన్న రత్నకుమార్ పడవను నదిలో తిరగేసి ధ్వంసం చేశారు. ఇంజన్‌ను దొంగలించారు. ఈ మేరకు రత్నకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అశ్లీల నృత్యాలపై కేసు నమోదు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం ఊనగట్ల గ్రామంలో గురువారం రాత్రి హిజ్రాలతో అశ్లీల నృత్యాలు చేయించినట్లు వచ్చిన సమాచారంపై చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర తన సిబ్బందితో రైడ్ చేశారు. అశ్లీల నృత్యాలు నిర్వహించిన ఆర్గనైజర్లు తదితరులపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య, కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పాలంగి గ్రామానికి చెందిన యార్లగడ్డ నాగ గంగరాజు (41) శుక్రవారం తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నాగ గంగరాజు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణం ఏడవ వార్డు సచివాలయంలో విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో పాలంగి పంచాయతీ విఆర్ఎ పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై తణకు వెళ్ళాడు. ఆర్థికంగా అప్పుల పాలు కావడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు, ఎవరి ప్రమేయము లేనట్లు మృతుడు సూసైడ్ నోట్ రాశాడని ఎస్ఐ తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య జీవనోపాధి కోసం ఇటీవలే గల్ఫ్‌కు వెళ్లిందన్నారు. పెద్ద కుమారుడు వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

నిప్పుల కుంపటి దుప్పటికి అంటుకోవడంతో గాయపడిన కాట్రావులపల్లికి చెందిన పి.ఎర్రమ్మ (60) కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. ఎర్రమ్మ తన కొడుకుతో కాట్రావులపల్లిలో నివాసం ఉంటోంది. చలి తీవ్రత ఎక్కువగా ఉండ డం తో ఈ నెల 15న వేడి కోసం మంచం కింద నిప్పుల కుంపటి పెట్టుకోగా అది ప్రమాదవశాత్తు ఎర్రమ్మ దుప్పటికి అంటుకుంది. ఎర్రమ్మగా గాయాలు కావడం తో పెద్దాపురం ఆసుపత్రిలో చేర్చగా మెరుగైన వైద్య నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతి చెందినట్లు తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని యర్రంపాలెంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్ రావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రతి 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్

ప్రజాశక్తి - అమలాపురం

ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్య క్రమం అమల్లో భాగం గా అత్యంత పరిశుభ్రత జిల్లా గా కోనసీమ జిల్లాను తీర్చి దిద్దాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం పై నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించి విధి విధానాలు పట్ల జిల్లా స్థాయి అధికారులకు ఆయన సూచనలు ఆదేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా చెత్త ఎక్కడున్నా గుర్తించి డంపింగ్ యార్డ్ కు తరలింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలలో డ్రయినేజీల్లో పూడిక తీతలు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ చర్యలు చేపట్టాలని సూచించారు ఈనెల 18 న ఎంఎల్ఎల భాగస్వామ్యంతో కార్య క్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్ర మంలో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణానికి ఆస్కారం ఉందని ప్రతి కార్యాలయం స్టేడియం వసతి గృహాలలో, మార్కెట్ యార్డులలో, రైతు బజార్లలో, వసతి గృహాలు పాఠశాలలో మరుగుదొడ్ల అవసరం ఉంటే ఆ వివరాలను క్రోడీకరించి ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కార్యాలయానికి సమర్పిస్తే అంచనాలను రూపొందిస్తారని ఆయన తెలిపారు. మండల డివిజన్ వారీగా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు ఎంపిడిఒలు పంచాయతీ అధికారులు సమన్వ యంతో ప్రత్యేక అధికారులు పరి శుభ్రత అంశాల పట్ల, గార్బేజ్ క్లీనింగ్ ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీనింగ్ అంశాలలో ప్రత్యేక దృష్టి పెట్టి కార్యక్రమ ఆశయ సాధనకు పాటు పడాలన్నారు. నెల నెలా ఒక ఇతివృత్తంతో 12 మాసాలకు 12 ఇతి వృత్తాలతో కార్య క్రమాలు నిర్వహించాలన్నారు. ఒక ఉద్యమంలా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో రెండు చెరువులను అభివృద్ధి పరచాలని ఆదేశించారు నెలలో మూడవ శనివారం స్వచ్ఛత కోసం అంకితం కావాలని ముఖ్య మంత్రి పిలుపు మేరకు ఇకపై ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహిం చేందుకు చర్యలు చే పట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అందరూ భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమ నిర్వహణకు సంబందించిన మార్గ దర్శకాలను ఇప్పటికే జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని అధికారులంతా అంకిత భావంతో నిర్వహించాలన్నారు పర్యావరణ పరిరక్షణ అంశంలో కమ్యునిటీ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, మరింత ఆహ్వానించే విధంగా ఆహ్లాదకరమైన వాతా వరణాన్ని కల్పించడం, ప్రయోజనాలను మెరుగుపరుస్తూ పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడమనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు ఆయన తెలిపారు. మార్గ దర్శకాలకు అనుగు ణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేం దుకు ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలను ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యులను చేయాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమ నిర్వహణలో పంచాతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పురపాలక, పట్టణా భివృద్ధి శాఖ కీలక భూమిక పోషిం చాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ సలీం బాషా, డిపిఒ శాంతిలక్ష్మి, డ్వామా పీడీ మధుసూదన్, డిఎస్‌డిఒ సురేష్ కుమార్, డ్రైనేజీ డివిజనల్ ఇంజినీర్ ఎంవివి.కిషోర్, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఇ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

యానాం వార్తలు



గేమ్స్‌కు ఎంపికైన ప్రేమ్ కుమార్

నేషనల్ గేమ్స్‌కు ప్రేమ్ కుమార్ ఎంపిక

ప్రజాశక్తి - యానాం

డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) యానాం శాఖలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుడు జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్టు శుక్రవారం సెంటర్ ఇన్‌ఛార్జి ఎన్.ఉదయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పెనుపోతు ప్రేమ్ కుమార్ ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే నేషనల్ గేమ్స్‌లో నిర్వహించే 50 మీటర్ల ఫ్రీస్టైల్‌కు పుదుచ్చేరి తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.



వాలంటీర్లకు టీ షర్టులు అందజేస్తున్న ఎస్ఐ శేరు నూకరాజు

రహదారి భద్రతా వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, ఎన్ఎస్ఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసంశెట్టి ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు జాతీయ రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వాలంటీర్లకు టీ షర్ట్స్, టోపీలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి గోపి మాట్లాడుతూ ఈ నెల 23 వరకు జాతీయ రహదారి భద్రతపై యానాం పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



శ్రీను బాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న హర్ష కుమార్, పొన్నాడ తదితరులు

మాజీ సర్పంచ్ శ్రీనుబాబు మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

బ్రహ్మసమేద్యం మాజీ సర్పంచ్ దళిత నాయకుడు, సీనియర్ వైసిపి నేత ఇసుకపట్ల శ్రీనుబాబు (46) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో ఆయనను కాకినాడ మెడికోవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

శ్రీను బాబు మృతి తీరని లోటు

ఇసుక పట్ల శ్రీనుబాబు మృతి దళిత వర్గానికి, పార్టీకి తీరని లోటని మాజీ ఎంపి జివి.హర్ష కుమార్, మాజీ ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పేర్కొన్నారు. శ్రీనుబాబు అంతిమయాత్ర కాట్రేనికోన గేట్ సెంటర్ నుంచి బ్రహ్మసమేద్యం స్వగృహం వరకు శుక్రవారం సాగింది. దారి పొడవునా ప్రజలు ఆయన మృతదేహానికి ఘన నివాళులర్పించారు. ఈ అంతిమయాత్రలో పార్టీలకు, కులాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్ కుమార్, ఎంపిపి పాలెపు లక్ష్మీ ధర్మారావు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, జిల్లా దళిత నాయకులు గడ్డం సురేష్ బాబు, ఇసుకపట్ల రఘుబాబు, నల్ల నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా : ముదునూరి

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

పేదవారికి ఏ కష్టం వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు న్నారు. నియోజకవర్గంలో పేదవారు పడుతున్న కష్టాలను తీర్చడానికే ఎంఎంఆర్ ట్రస్ట్ ప్రారంభించామని తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంగా ట్రస్ట్ సేవలు ప్రజలకు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కాకినాడ ఆస్పత్రిలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న ధర్మవరం గ్రామానికి చెందిన వేమూలూరి రాంబాబు, పెద్దిపాలెం గ్రామానికి బంధం చిన్నారావును ఆయన పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ట్రస్ట్ తరపున బంధం చిన్నారావుకు రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. వేములూరి రాంబాబుకి కూడా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవ లక్ష్మణ్, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, కోన బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైద్యుడు మృతి

ప్రజాశక్తి -కాజులూరు

గుండెపోటుతో వైద్యుడు సత్తి శ్రీరామ రెడ్డి (52) మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరామారెడ్డి కుటుంబం మరో రెండు కుటుంబాలు అరుణాచలం తీర్థయాత్రకు వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున గిరి ప్రదక్షిణ చేస్తుండగా రామారెడ్డికి గుండెపోటు రావడంతో అక్కడకక్కడే మృతి చెందినట్టు తెలిపారు. రామారెడ్డి భార్య సత్తి గంగాదేవి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తుండగా కుమార్తె కుమారుడు ఉన్నారు. రామారెడ్డి గొల్లపాలెంలో ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హాయంలో రామారెడ్డి సహకార సంఘం అధ్యక్షునిగా పని చేశారు. ఈయన మతికి పలువురు సంతాప వ్యక్తం చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర జడ్‌పి ఉన్నత పాఠశాలలో 2004-2005 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చదువుకున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలో వారంతా కలుసుకున్నారు..ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడు తూ సమాజం సమాజంలో గౌరవంతో మెరుగుతూ ముందుకు వెళ్లాలని తమకు పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు .



కార్యక్రమంలో పాల్గొన్న అంగర జడ్‌పి ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అభివద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వ ధ్యేయమని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామంలో జగతా చంటి, పోలిశెట్టి బ్రహ్మాజీ లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం గోదాసి పుండరీష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు తో పాటు అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాలో ఇన్‌ఛార్జిలు లేకపోయినా అక్కడ కార్యకర్తలు స్థానిక సంస్థల్లో విజయం సాధించి పార్టీని బలోపేతం చేశారని, అలాగే ముమ్మిడివరం నియోజకవర్గంలోను కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నామినేటెడ్ పదవులలో సొసైటీ అధ్యక్షునిగా ఎన్నికైన గోదశి పుండరీష్, నూకల మూర్తి, విళ్ల వీర, సిహెచ్ వీరబాబు, గంగుమళ్ల రవినీటిసంఘం అధ్యక్షునిగా ఎన్నికైన గుద్దటి జమ్మి ని, డైరెక్టర్లను,ఉపాధ్యక్షులను మరియు హాస్పటల్ కమిటీల డైరెక్టర్లను శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం జనసేన శ్రేణులు ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దూడల స్వామి, కర్రా దుర్గాప్రసాద్, మోకా బాల ప్రసాద్,ఎం పురుషోత్తం, ముత్యాల జయలక్ష్మి, అంగాని నరసింహమూర్తి, సవరపు వెంకట్, రంబాల రమేష్, పుణ్యమంతుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాణయనను సత్కరిస్తున్న ముమ్మిడివరం జనసేన పార్టీ శ్రేణులు

ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ ధాన్యంకు రూ.500 బోనస్ ప్రకటించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. నేడు మార్కెట్లో కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని దీనివల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. కేరళ, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాలు బోనస్ ప్రకటించి అక్కడ రైతులను ఆదుకుంటున్నాయని గుర్తు చేశారు. ఎరువులు, పురుగు మందులు విత్తనాలు, డీజిల్ తదితర ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు నష్టాల పాలవుతున్నారని అన్నారు. మరోవైపు అకాల వర్షాలు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు కౌలు రైతులను వెంటాడుతున్నాయన్నారు. ఫలితంగా పండించిన పంటకు రక్షణ లేకుండా పోయిందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ప్రకటించడంతోపాటు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డిటి నరేష్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడి డిప్యూటీ తహశీల్దారు ఎస్‌వి.నరేష్‌కు తహశీల్దారుగా పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా ఉన్నత అధికారుల నుంచి శుక్రవారం ఆదేశాలు వెలువడ్డాయి. ఇప్పటివరకూ శంఖవరం తహశీల్దారు పోతురాజు రౌతులపూడి తహశీల్దారుగా పని చేశారు.

పంపన ప్రసాద్ నేత్రాల దానం

ప్రజాశక్తి- తాళ్లరేవు

తాళ్లరేవు గ్రామానికి చెందిన ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ పంపన ప్రసాద్ శుక్రవారం తెల్లవారుజామున అకస్మికంగా మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులతో తాళ్ళరేవు లయన్స్ క్లబ్ సభ్యులు నరేంద్ర సంప్రదించి ప్రసాద్ కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేశారు. ఐ బ్యాంక్ టెక్నీషియన్ రవి కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులను కాటాడి రమేష్, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, చోడే శ్రీనివాస్, బొంతు మోహన్, ధూళిపూడి బాబి, దొర తదితరులు పరామర్శించారు.

బాలలను క్రీడల్లో ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

చిన్ననాటి నుండి విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఐదు రోజులపాటు జరిగే జాతీయస్థాయి స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలను శుక్రవారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం రాజా సూరిబాబు రాజుతో కలిసి ఆయన చదరంగం ఆడి పోటీలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం సిద్ధిస్తుందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించేందుకు శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ డైరెక్టర్ విజయ ప్రకాష్ ముందుంటారన్నారు. ఎపి చెస్ అసోసియేషన్ చైర్మన్ కెవివి.శర్మ మాట్లాడుతూ 26 రాష్ట్రాల నుండి 1200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ క్రీడాకారులందరూ ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొంటూ తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. శ్రీప్రకాష్ స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ క్రీడాకారులందరికీ భోజన వసతి సౌకర్యాలతో పాటు అన్ని సదుపాయాలూ స్కూల్లో ఏర్పాటు చేశామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి -గొల్లప్రోలు

చినజగ్గంపేటలో శుక్రవారం ప్రైమరీ హెల్త్ సెంటర్ ద్వారా ప్రజలకు ఇంటింటా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లులకు చిన్న పిల్లలకు మలేరియా దోమ కాటు, సీజన్ వ్యాధుల మీద ప్రజలకు ఎడిఎస్ ఎనాఫిలిస్ దోమ లార్వా ద్వారా అడల్ట్ దోమగా మారి డెంగీ మలేరియా వ్యాప్తి చెందుతాయని తెలిపారు. కాబట్టి సముదాయాల డ్రమ్ములు, నీటి తొట్టెలల్లో నీటిని ఖాళీ చేసి మార్చాలని, నిల్ల నీరు ఉంచకూడదని కాళీ జాడీలు డ్రింక్ సీసాలు ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాలలో ఉండకూడదని ఆసుపత్రి పర్యవేక్షకులు మహమ్మద్ బాషా తెలిపారు. ఎఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా ముసలమ్మ తీర్థం

ప్రజాశక్తి - ఆలమూరు

పినపళ్లలో శ్రీలక్ష్మీ స్వరూప ముసలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక పేపరుమిల్లు రోడ్డులో నెలకొల్పిన అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పారిశ్రామిక వేత్తలు, శ్రీకృష్ణ ప్రభాస్ పేపరుమిల్లు అధినేతలు వంక సత్యనారాయణ (అన్నవరం), వైట్ల దుర్గారావు, వల్లూరి వెంకట్రావులతో పాటుగా ఎఎంసి మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సేవా కార్యక్రమాల్లో టిడిపి శ్రేణులు పాల్గొనాలి

ప్రజాశక్తి - కొత్తపేట

టిడిపి వ్యవస్థాపకుడు ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 18న శనివారం జరగబోయే సేవా కార్యక్రమాల్లో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గం పరిధిలో గ్రామ గ్రామాన వాడవాడలా ఎన్‌టిఆర్ వర్ధంతి నిర్వహించాలన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో గల ఎన్‌టిఆర్ విగ్రహానికి నేడు ఉదయం 10 గంటలకు కొత్తపేటలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారన్నారన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తారన్నారు.

ప్రమాద బాధితులకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి -కాకినాడ రూరల్

ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి రోడ్డు ప్రమాద బాధితులను కాకినాడ రురల్ ఎంఎల్ఎ పంతం నానాజీ శుక్రవారం పరామర్శించారు. జరిగింది. గోపాలచెరువు వద్ద టెంపో ట్రావెల్ కాలువలో అదుపుతప్పి బోల్తా కొట్టడం వల్ల సుమారు 28 మందికి తీవ్రగాయలయ్యాయి. వీరు మెడికవర్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటన ఎంతో బాధాకరమైనదని, సుమారు 28 మంది క్షతగాత్రులలో 8 మందికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారని చెప్పారు. అతి పెద్ద అత్యవసర విభాగం, అత్యంత అనుభవం కలిగిన వైద్యులు క్షతగాత్రులకు తగిన చిక్సి అందించారని అభినందిచారు.

In the Court of the VIIth Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 420/2020

Between:
Canara Bank (previously Syndicate Bank), Rep. by its Senior Branch Manager, Vakalapudi Branch, Kakinada, and its General Power of Attorney Holder, Polisetti Venkata Chalam. ***...Plaintiff***

AND

1. Korra Srinivas
2. Saripalli Satti Babu

...Defendants

D-1: Korra Srinivas, S/o. Ramarao, aged 42 years, Occupation: Auto Consultancy, R/o. D.No. 1-69/3, Simhadri Nagar, Near PMR Ice Factory, Valasapakala, Kakinada Rural, Kakinada District.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 31-01-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

V.VENKATA RAMANA MURTHY
Advocate, Kakinada
Cell: 9866033899

In the Court of the 6th Addl. Dist. Judge, Kakinada
O.S. No. 68/2022

Between:
Gubbala Ramana ***...Plaintiff***

AND

Gubbala Apparao and Others ***...Defendants***

D-5: Anasuri Sathiyamma,W/o. Satyam, age 90 yrs, House wife, Madhavapatnam, Kakinada.

D-6: Bonthu Kanakamma, W/o. Polaraju, age 50 yrs, House wife, Ramalayam Street, Tadiparthi, Chebrolu (M).

పై నెంబరు కేసులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక తప్పించుకొని తిరుగుచున్నారు. మీ హాజరు నిమిత్తం **ది. 29-1-2025 ఉదయం 10 గంటలకు** వాయిదా అయి ఉన్నది. మీరు హాజరు కానిచో మీరు Exparty అగుదురు అని తెలియచేయడమైనది.

A.V.CH.S.S.MURTHY
KALA NAGESWARA RAO
Advocates, Kakinada
Cell: 9848338335

నోటీసు
మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.21/2019

Between:
1. గాదె లక్ష్మీ మంగరాజు ...వాది

మరియు

1. తోట రామారావు & 8మంది ...ప్రతివాదులు

టు :
5&7 ప్రతివాదులు :

5. శ్రీమతి కొల్లి బోణి సృజన, భర్త : దూళ్ళ హనుమాన్ చంద్ర మోహన్, ఫ్లాట్ నెం. 101, శ్రీనిలయం, శ్రీనివాసపురం, కొవ్వూరు, కొవ్వూరు మండలం, తూ.గో.జిల్లా.
7. పి. నవీన్ బాబు, తండ్రి : (లేటు) పి. అనంత పద్మనాభరావు, సింధు అపార్టుమెంట్స్, వీరభద్రపురం, రాజమండ్రి, తూ.గో.జిల్లా.

పై నెంబరు దావాలో 5,7 ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టువారు దావా సమన్లు పంపించుచున్ననూ వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపించుచున్నందున, శ్రీ కోర్టువారు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా దావా సమన్లు అమలుపరచుటకు ఉత్తర్వులు యిచ్చినందున పై కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం యీ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది. కావున, **ది. 24-01-2025** వ తేదీ, **ఉ. 10-00 లకు** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయివున్నది. ఆరోజున మీరు స్వయంగా గాని, లేదా న్యాయవాది గారి ద్వారా గాని, పై కోర్టు వారి ఎదుట హాజరు అయి, మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : 24-01-2025

శ్రీ టి.ఎన్.వి. రమణమూర్తి,
యం.గోపి,అడ్వకేట్స్
కొవ్వూరు
స్థలం:కొవ్వూరు,
తేది:17-01-2025
ఫోన్:9848761670